బిజెపిది దిక్కుమాలిన పాలసీ

- దేశంలో 361 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు
- విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం దౌర్భాగ్యం
- ధరణితో రైతులు, పల్లెలు సుభిక్షంగా ఉన్నాయి
- దీనిని తీసేస్తామన్న వారిని బంగాళాఖాతంలో పడేయాలి
- వికలాంగులకు పింఛను మరో రూ.వెయ్యి పెంపు
- మంచిర్యాల సభలో ముఖ్యమంత్రి కెసిఆర్

బహిరంగ సభలో మాట్లాడుతున్న కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సర్కారు బొగు గనులను ప్రయివేటుకు అప్పగిద్దామని ప్రయత్నం చేస్తోంది.. దేశంలో బొగ్గుకు కొరత లేదు.. 361కోట్ల బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా ప్రయివేటుపరం చేయాలని చూస్తోంది.. ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటోంది.. ఇదేం దిక్కుమాలిన పాలసీ అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. రాష్ట్రానికి వచ్చిన మోడీ సింగరేణిని ప్రయివేటుపరం చేయబోమని చెప్పారని.. బెంగళూరు వెళ్లిన తర్వాత ప్రయివేటుకు అప్పగిస్తామని చెప్పారని ఎద్దేవా చేశారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలుస్తోందని తెలిపారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన సమీకృత కలెక్టరేట్ భవనంతో పాటు పలు అభివృద్ధి పనులు, కొత్త పథకాలను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్యక్షతన నస్పూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం మాట్లాడారు. అస్సాంతోపాటు దేశ రాజధాని ఢిల్లీలోనూ కరెంటు కోతలు ఉన్నాయని, ఎలాంటి కోతలు లేకుండా 24గంటల పాటు కరెంటు సరఫరా చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. మరో 150ఏండ్లపాటు దేశానికి అవసరమైన కరెంటు ఉత్పత్తి చేసేందుకు బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, కానీ కేంద్రం ఈ రంగాన్ని ప్రయివేటుకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగా విదేశాల నుంచి ఇబ్బడిముబ్బడిగా బొగ్గు దిగుమతి చేసుకుంటోందని విమర్శించారు.

ఈ యాసంగిలో దేశమంతా 94లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా ఇందులో తెలంగాణలోనే 54లక్షల ఎకరాల్లో వరి సాగైందని తెలిపారు. 3కోట్ల టన్నుల ధాన్యం పండుతోందన్నారు. తలసరి ఆదాయం, విద్యుత్‌శక్తి, మున్సిపాలిటీలు, తాగునీటి సరఫరా తదితర రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. 134ఏండ్ల చరిత్ర కలిగిన సింగరేణిని గత కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని, కేంద్రం దగ్గర అప్పులు తీసుకొని 49శాతం వాటా కింద కేంద్రానికి కట్టబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 11వేల కోట్ల టర్నోవర్ ఉండగా.. తెలంగాణ వచ్చిన తర్వాత 33వేల కోట్ల టర్నోవర్‌కు పెంచామని, సింగరేణిలో ఈ సంవత్సరం రూ.2184కోట్ల లాభాలు గడించామని తెలిపారు. గతంలో కాంగ్రెస్ హయాంలో 6453 ఉద్యోగాలు కల్పిస్తే.. తెలంగాణ వచ్చిన తర్వాత 19,463 ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. సింగరేణి కార్మికులకు వచ్చే దసరాకు రూ.700కోట్ల బోనస్ ఇస్తామని ప్రకటించారు. తాము ధరణిని తీసుకొచ్చిన తర్వాత పల్లెల్లో ఎలాంటి తగాదాలు, భూకబ్జాలు లేకుండా పోయాయని రైతులు, పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయని చెప్పారు. తెలంగాణలో 2.75కోట్ల ఎకరాలు భూమి ఉండగా.. 1.55కోట్ల ఎకరాలు ధరణిలో ఎక్కాయని, మిగిలిన 65లక్షల ఎకరాలు అటవీ భూమి ఉందని వివరించారు. 99శాతం రైతుల భూములు ధరణిలో ఎక్కాయని చెప్పారు. కానీ కాంగ్రెస్ నాయకులు ధరణిని తీసేస్తామని చెబుతున్నారని, మళ్లీ దళారుల రాజ్యం తీసుకొస్తారని జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ధరణిని తొలగిస్తామని చెప్పినోళ్లను ఎన్నికల్లో బంగాళాఖాతంలో విసిరేయాలన్నారు. ఆపద మొక్కులు మొక్కేవారిని నమ్మకూడదని హితవుపలికారు.

ఈ నెల నుంచే వికలాంగులకు ప్రతి నెలా రూ.4116 పింఛన్ అందజేస్తామని, కుల వృత్తులకు రూ.లక్ష సాయం పథకం ప్రారంభించామని, సొంత జాగా కలిగిన వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు అందజేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, రేఖానాయక్, జోగు రామన్న, రేఖానాయక్, జిల్లా పరిషత్ అధ్యక్షులు నల్లాల భాగ్యలక్ష్మి, కోవలక్ష్మి జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, దండె విఠల్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు, విజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చేప మందు

- 32 లైన్ల ద్వారా చేప మందు పంపిణీకి చర్యలు
- ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేప మందు ప్రసాదం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ అందిస్తామని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేప ప్రసాదం కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే లక్షలాది మంది ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బత్తిన హరినాథ్ గౌడ్ కుటుంబ సభ్యులు ఇచ్చే చేప ప్రసాదంపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందన్నారు. కరోనా కారణంగా మూడేండ్లపాటు పాటు చేప ప్రసాదం పంపిణీ చేయలేదని తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు వచ్చారని, వారి సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలూ కల్పించిందన్నారు. అవసరమైనన్ని చేపపిల్లలను మత్స్యశాఖ సరఫరా చేసినట్టు తెలిపారు. జీహెచ్‌ఎంసీ, ఆర్‌అండ్‌బి, విద్యుత్, జలమండలి, పోలీస్, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ, ఆర్టీసీ, ఫైర్ సర్వీస్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పని చేస్తూ ఏర్పాట్లు చేశాయన్నారు. 5 తరాల నుంచి బత్తిన సోదరులు తయారు చేస్తున్న చేప ప్రసాదానికి చాలా గుర్తింపు ఉన్నదని చెప్పారు. శుక్ర, శనివారాల్లో చేప మందును అందించనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, మత్స్యశాఖ ఆధ్వర్యంలో 1.5 లక్షల కొర్రమీను చేపలను అందుబాటులో ఉంచామని, అదనంగా మరో 75 వేల చేప పిల్లలతోపాటు.. అవసరమైతే మరిన్ని చేప పిల్లలను అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. మొత్తం 32 లైన్ల ద్వారా ప్రసాదం పంపిణీ చేస్తున్నామని, నాంపల్లి గ్రౌండ్ పరిసరాల్లో 700 వరకు సీసీ కెమెరాలు, దాదాపు 300 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రయాణికుల కోసం టీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుందని వివరించారు. స్వచ్ఛంద సంస్థలు సేవలు అందించినట్టు మంత్రి తెలిపారు. అగర్వాల్ సేవ సమితి, పంజాబీ సేవ సమితి, జైస్వాల్ సేవ సమితి వారు ఉచితంగా ఏర్పాటు చేసిన అన్నదానం కౌంటర్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న విసి సజ్జనార్

పులుల సంరక్షణపై బస్సులో ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పులుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశంలోనే తొలిసారిగా టిఎస్‌ఆర్‌టిసి వినూత్న కార్యక్రమనికి శ్రీకారం చుట్టింది. జీవవైవిధ్యంలో పులుల ప్రాముఖ్యతను వివరించేందుకు ఫొటోగ్రఫీ ద్వారా 'హైదరాబాద్ ఆన్ వీల్స్' బస్సులో టైగర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఇండియన్ ఫొటో ఫెస్టివల్ (ఐపిఎఫ్), ఐసిబిఎం-స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెన్స్ సహకారంతో టిఎస్‌ఆర్‌టిసి ఏర్పాటు చేసింది. పిసిసిఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్, టిఎస్‌ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కెబిఆర్ పార్క్ వద్ద ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఐసిబిఎం-స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెన్స్ డీన్(అకడమిక్స్), వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ప్రొఫెసర్ జితేందర్ గోవిందాని తీసిన పులుల ఫొటోలను టిఎస్‌ఆర్‌టిసి ప్రదర్శిస్తోంది.

రాకేశ్ మోహన్ డోబ్రియాల్ మాట్లాడుతూ.. పులుల సంరక్షణకు ప్రజల్లో అవగాహన కల్పించడానికి టిఎస్‌ఆర్‌టిసి బస్సులో టైగర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ అటవీ శాఖ కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని పులుల సంరక్షణకు చర్యలు తీసుకుంటోందన్నారు. రెండు టైగర్ రిజర్వ్‌లలో దాదాపు 30 పులులు ఉన్నాయని చెప్పారు. పులులను కాపాడటమంటే అడవులను, వాటిలోని జీవరాశిని, జీవవైవిధ్యాన్ని రక్షించడమేనని చెప్పారు. విసి సజ్జనార్ మాట్లాడుతూ.. జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పులులను సంరక్షిస్తే పర్యావరణాన్ని సంరక్షించినట్టే అని చెప్పారు. ఫొటోగ్రఫీ చాలా ప్రభావవంతమైన మీడియా అన్నారు. 'ప్రాజెక్ట్ టైగర్' 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సామాజిక బాధ్యతగా 'హైదరాబాద్ ఆన్ వీల్స్'లో టైగర్ ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించామని చెప్పారు హైదరాబాద్‌లోని జనసమ్మర్థ ప్రాంతాల్లో హైదరాబాద్ ఆన్ వీల్స్ బస్సు తిరుగుతుందని, ప్రజలందరూ ఈ ఫొటో వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సహకరించిన ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణహితం కోసం టిఎస్‌ఆర్‌సి ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో మొత్తం ఎలక్ట్రిక్ బస్సులే నడిపేలా సంస్థ ప్లాన్ చేస్తోందని వివరించారు. హైదరాబాద్ ఆన్ వీల్స్ బస్సులో టైగర్ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని ఐపిఎఫ్ వ్యవస్థాపకుడు ఆక్విన్ మాథ్యూస్ అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిసిఎఫ్ సైదులు, ఐపిఎఫ్ ప్రతినిధులు తరుషా సక్సేనా తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

సాహిత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- అధికారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ భాషా-సాంస్కృతిక, సాహిత్య అకాడమీ అధికారులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొమ్మిదేండ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాహిత్య వైభవాన్ని చాటి చెప్పేలా ఆ దినోత్సవాన్ని రాష్ట్ర స్థాయిలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గంగా జమునా తెహజీబ్‌ను ప్రతిబింబించేలా ఉర్దూ, తెలుగు భాషల్లో రాష్ట్రస్థాయిలో 33 జిల్లాల్లో రచనం, పద్యం, ఉర్దూ కవిత్వంలో కవి సమ్మేళనాలను నిర్వహించాలన్నారు. రాష్ట్రస్థాయిలో రవీంద్ర భారతిలో నిర్వహించిన తర్వాత ఎంపికైన ఉత్తమ కవితలకు మొదటి బహుమతిగా రూ.1,00,116, రెండో బహుమతిగా రూ.75,116, మూడో బహుమతిగా రూ.60,116, నాలుగో బహుమతిగా రూ.50,116, ఐదో బహుమతిగా రూ.30,116 అందించి కవులను, సాహితి వేత్తలను ప్రోత్సహించాలని మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఉత్తమ కవితలను కలిపి పుస్తక రూపంగా తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయాలి

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిన్నపిల్లలు, నవజాతశిశువులు, క్యాన్సర్ చివరి దశలో ఉన్న వారికి అందించే పాలియేటివ్ కేర్ ఫెసిలిటీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. అదేవిధంగా రక్తదానంపై అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. శిబిరాల నిర్వహణ ద్వారా రక్తదానాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. శుక్రవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ పనితీరుపై మంత్రి నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లో పెరిగిన విశ్వాసాన్ని నిలుపుకునేలా కృషి చేయాలని కోరారు. రోగులు, వారి సహాయకులతో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది గౌరవంగా ఉండాలని, వారి మెప్పు పొందేలా సేవలందించాలని చెప్పారు. అనవసర సీ సెక్షన్ ఆపరేషన్ల సంఖ్యను తగ్గించే దిశగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. డిశ్చార్జి అయిన రోగులకు అవసరమైన మందులు ఇచ్చి పంపేలా ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. జూన్ 14న వైద్యారోగ్యశాఖ దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపుచ్చారు.

వడిత్య పాండుకు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా

- సిఎం ప్రకటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చెరువుల పండగ సందర్భంగా నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం దాసరి నెమిలిపూర్ గ్రామానికి చెందిన వడిత్య పాండు గురువారం ప్రమాదంలో మరణించడం పట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రవీంద్ర నాయక్ అభ్యర్థన మేరకు వారి కుటుంబానికి రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియాను సిఎం ప్రకటించారు.

ఎరియర్స్ విడుదల చేయాలి

- శ్వేతామహంతికి ఐక్యవేదిక వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సెకెండ్ ఏఎన్‌ఎం, ఇతర ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికి పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల ఎరియర్స్ బకాయిలను విడుదల చేయాలని వైద్యారోగ్యశాఖ ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఐక్యవేదిక నాయకులు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతామహంతికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, త్వరలోనే పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్ బకాయిలను విడుదల చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

ప్రగతిని చూసి ప్రజలే సమాధానం చెప్పాలి

: మంత్రి తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముప్పై ఏళ్లుగా జరగని అభివృద్ధి ఐదేళ్లలో జరిగి అద్భుతమైంది..

ఈ ప్రగతిని చూసి నల్లగొండ ప్రజలే రాబోయే ఎన్నికల్లో సమాధానం చెప్పాలని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్‌జి కళాశాలలో ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను శుక్రవారం మంత్రి పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. 2014లో తెలంగాణ ఏర్పాటు కాకముందు ఏ ప్రభుత్వమూ మత్స్యకారులను గుర్తించలేదన్నారు. వారికి ఆదాయం కల్పించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టామని చెప్పారు.

లక్ష జన నినాదమే ప్రజాగర్జన

- సబ్బండ వర్ణాల సమీకరణే లక్ష్యం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లక్ష మంది జన నినాదమే ఈ నెల 11న కొత్తగూడెంలో జరగనున్న ప్రజాగర్జన బహిరంగ సభ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపోరాటాలు, పార్టీ విస్తృతితో పాటు ఎన్నికలూ పార్టీ కార్యక్రమంలో ఒక భాగమని స్పష్టం చేశారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలనపై నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మూడు వేల గ్రామాల్లో ప్రచారం చేయడంతో పాటు లక్ష మంది కార్యకర్తలను ఈ కార్యక్రమంలో పాలు పంచుకునేలా చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా కోటి మందికి సందేశాన్ని అందించామన్నారు. 'దేశ్‌కో బచావో - బిజెపికో హఠావో' నినాదంతో పార్టీ విస్తృత కార్యక్రమం తీసుకోవడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మత భావజాలాన్ని నిలువరించ గలిగామన్నారు. దేశ వ్యాప్తంగా బిజెపికి గడ్డుకాలం ప్రారంభమైందని, రామాలయం ఉన్న అయోధ్య మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ ఆరు స్థానాల్లో విజయం సాధించిందని, రామాలయం ఉన్న ప్రాంతంలోనూ సిపిఐ అభ్యర్థి కౌన్సిలర్‌గా గెలుపొందారని తెలిపారు. ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకురావడంతో పాటు సిపిఐ భవిష్యత్ కార్యాచరణను ఈ బహిరంగ సభలో దిశా నిర్దేశం చేయనున్నామని తెలిపారు.

రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ అర్హులైన రైతుల స్వాధీనంలో ఉన్న భూమి ప్రకారం 11 లక్షల ఎకరాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆది నుంచి పార్టీకి దన్నుగా నిలిచిందని, అందుకే కొత్తగూడెంలో ప్రజాగర్జన సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవినీతిమయమైన పాలక పార్టీల వల్ల ప్రజలు విసిగిపోయారని, కమ్యూనిస్టుల వైపు చూడక తప్పని రోజులు వస్తున్నాయని తెలిపారు. సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, సిద్ధినేని కర్ణకుమార్ పాల్గొన్నారు.

కారును ఢీ కొట్టిన లారీ..

- ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా వైరా మండలం స్టేజీ పినపాక వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఖమ్మం నుంచి కల్లూరు మండలం వాత్యా నాయక్ తండాకు వెళుతున్న కారును తల్లాడ వైపు నుంచి వైరా వస్తున్న లారీ స్టేజీ పినపాక వద్ద ఢీ కొట్టడంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ దుర్ఘటనలో ఏడాదిన్నర పాప బానోత్ శ్రీ వల్లి, బానోత్ అంజలి, కారు డ్రైవర్ అజ్మీరా రాంబాబు అక్కడికక్కడే మృతిచెందారు. వాత్య నాయక్ తండా సర్పంచ్ బానోత్ బాబు, బానోత్ రవి, బానోత్ ప్రవీణ్, బానోత్ స్వాతి, బానోత్ కార్తికేయలకు గాయాలయ్యాయి. వారిని ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. కాగా, కారును లారీ ఢీ కొన్న తర్వాత కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

స్వరాష్ట్రంలో సుపరిపాలన

- 33 జిల్లాలు, 74 రెవెన్యూ డివిజన్లు, 612 మండలాలు
- దశాబ్ది ఉత్సవాల్లో నేడు సుపరిపాలన దినోత్సవం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత సాహసోపేతంగా పరిపాలనా సంస్కరణలు అమలు చేసింది. ఏకకాలంలోనే పరిపాలనా విభాగాల పునర్విభజన చేపట్టింది. కొత్త పరిపాలనా విభాగాలను కూడా ఏర్పాటు చేసింది.

కొత్త జిల్లాల ఏర్పాటు

తెలంగాణలో 2016 అక్టోబర్‌కు ముందు 10 జిల్లాలుండేవి. ఒక్కో జిల్లాలో సగటున 35 లక్షలకుపైగా జనాభా ఉంది. దీనివల్ల పరిపాలన కష్టతరమయ్యేది. కొన్నిచోట్ల జిల్లా కేంద్రాలకు, కార్యాలయాలకు పోవాలంటే 200 నుంచి 250 కి.మీల దూరం వెళ్లాల్సివుండేది. దీంతో జిల్లా కేంద్రాల అధికారులు గ్రామాలకు పోవాలన్నా, ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాలన్నా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. జిల్లాలో కుటుంబాల సంఖ్య 10 లక్షలుండేది. దీంతో ఎవరి పరిస్థితేంటో తెలుసుకోవడం అధికారులకు కష్టంగా మారేది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ కష్టం అయ్యేది. దీంతో అధికారులకు ప్రజల సమస్యలపై దృష్టి కేంద్రీకరించడం కష్టంగా మారింది. ఈ సమస్యలను అధిగమించటానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణ చట్టం-1974 ప్రకారం తెలంగాణలో మరో 23 కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి, జిల్లాల సంఖ్యను 33 వరకు పెంచింది. దీంతో చిన్న పరిపాలనా విభాగాలతో సమర్ధవంతమైన పాలన జరుగుతున్నది. కొత్త జిల్లాలను 2016 అక్టోబర్ 11న ప్రారంభించారు. రెవెన్యూ డివిజన్ల సంఖ్యను 43 నుంచి 74 వరకు, మండలాల సంఖ్యను 459 నుంచి 612 వరకు, గ్రామ పంచాయతీల సంఖ్యను 12,769 వరకు పెంచింది.

పరిపాలనా సౌలభ్యం, ప్రయోజనాలు

ప్రభుత్వ శాఖల నూతన విభాగాలను ఆ జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ప్రజలు గంట సేపట్లోనే తమ జిల్లాలోని ఏ ప్రదేశానికైనా వెళ్లే అవకాశం కలిగింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, పర్యవేక్షణ అధికారులకు సులభమవుతున్నది. స్థానిక పరిస్థితులు, వనరులు, ప్రత్యేకతలు, ప్రజల అవసరాలు, సామాజిక స్థితిగతులపై అధికారులకు పూర్తి అవగాహన కలుగుతున్నది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఏజన్సీ, అటవీ ప్రాంతాలు ఉన్నాయి. అటవీ రక్షణ, గిరిజనుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేయడం అధికారులకు సులభమవుతుంది. కొన్ని జిల్లాల్లో ఎస్‌సి జనాభా ఎక్కువగా వుంది. అక్కడ ఎస్‌సిల కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతూ ఈ రకంగా స్వరాష్ట్రంలో సుపరిపాలన సాకారమైందని సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నాలుగైదు రోజుల్లో నిర్ణయం

- హైదరాబాద్ వేదికగా ఏ పార్టీనో వెల్లడిస్తాం
- ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీ మార్పుపై ఉత్కంఠ వీడే సమయం ఆసన్నమైంది. మరో నాలుగైదు రోజుల్లో తాను ఏ పార్టీలో చేరేది స్పష్టతనిస్తానని పొంగులేటి శుక్రవారం ఖమ్మంలో ప్రకటించారు. స్థానిక ఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య అనుచరుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగైదు రోజుల్లో ఏ పార్టీలో చేరుతానో చెబుతానని, ఏ పార్టీలో చేరాలనే విషయమై అనుచరులు అభిప్రాయానికి అనుగుణంగానే నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. వేలాదిమంది ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశమైన తాను.. వారి అభిప్రాయాలను సేకరించానన్నారు. తనను గేలి చేసిన వాళ్ళు.. చిన్న చూపు చూసినవాళ్లు ఉన్నారని, కొందరు వ్యక్తిగత విమర్శలకు దిగారని, అయినప్పటికీ అన్నింటిని చిరునవ్వుతోనే స్వీకరించానని తెలిపారు. ఏ నిర్ణయం తీసుకుంటే కల్వకుంట్ల చంద్రశేఖరరావును, అహంకారపూరిత ప్రభుత్వాన్ని ఇంటికి పంపించవచ్చో అభిప్రాయసేకరణ కోసమే ఇంత సమయం పట్టిందన్నారు. బిఆర్‌ఎస్‌కు వడ్డీతో సహా తిరిగిచ్చే సమయం వచ్చిందని, హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి త్వరలోనే పార్టీ చేరిక తేదీలు ప్రకటిస్తానన్నారు.. ఖమ్మం బహిరంగ సభ తేదీలనూ త్వరలోనే వెల్లడిస్తానంటూ తెలిపారు. కెసిఆర్‌ను తండ్రిలా భావించి పార్టీలో చేరితే.. తనను చాలా అవమానించారని, అయినా సహనంతో అన్నింటినీ భరించానన్నారు. కానీ, 2019 లోకసభ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోగా.. తర్వాత ఇస్తానన్న రాజ్యసభ కూడా ఇవ్వలేదని చెప్పారు. కనీసం కలిసి మాట్లాడేందుకూ అవకాశం ఇవ్వలేదని తెలిపారు. కాగా, అనుచరుల సమావేశంలో జై కాంగ్రెస్ నినాదాలు మిన్నంటాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో పొంగులేటి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో ముఖ్యనాయకులు, అనుచరుల్లో అత్యధిక మంది కాంగ్రెస్‌లో చేరాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ఆయనతోపాటు మాజీ మంత్రి జూపల్లి, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కలిసి వచ్చే నేతలందరూ ఒకేసారి కాంగ్రెస్ గూటికి చేరతారని సమాచారం. విలేకరుల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, నాయకులు బొర్రా రాజశేఖర్, మువ్వా విజయ్ బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, విజయాబాయి, కోట రాంబాబు, దొడ్డా నగేష్, తదితరులు ఉన్నారు.

షార్ప్ నుంచి కొత్త ప్రింటర్లు

హైదరాబాద్ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ షార్ప్ బిజినెస్ సిస్టమ్స్ కొత్తగా మల్టీ ఫంక్షన్ ప్రింటర్ల పోర్ట్ పోలియోను విస్తరించినట్లు తెలిపింది. అధునాతన, ఎసెన్షియల్ సిరీస్ పోర్ట్‌ఫోలియోలో 11 కొత్త కలర్, మోనోక్రోమ్ మల్టీఫంక్షన్ ప్రింటర్లను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. గోవాలో నిర్వహించిన డీలర్ల మీట్‌లో వీటిని విడుదల చేసినట్లు తెలిపింది. పెద్ద కార్పొరేషన్‌లు, విద్యా సంస్థలు, కన్సల్టింగ్ సంస్థలు, పబ్లిషింగ్ హౌస్‌లు, హాస్పిటల్స్ తదితర వాటి అవసరాలకు సరిపోతాయని పేర్కొంది.

Knight Frank

హైదరాబాద్‌లో పెరిగిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు

- మేలో 31 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఏడాది మేలో హైదరాబాద్‌లో ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లలో 31 శాతం వృద్ధి చోటు చేసుకుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్ వెల్లడించింది. గడిచిన నెలలో మొత్తంగా 5877 నివాసాలు రిజిస్ట్రేషన్ కాగా.. ఇంతక్రితం ఏప్రిల్‌లో ఇది 4494 యూనిట్లుగా ఉందని వెల్లడించింది. విలువ పరంగా 2023 మేలో 31 శాతం వృద్ధితో రూ.2,994 కోట్ల విలువ చేసే ఆస్తుల రిజిస్ట్రేషన్ నమోదయ్యింది. రూ.25-50 లక్షల మధ్య విలువ చేసే నివాసాలు 55 శాతం వాటా కలిగి ఉన్నాయి. 1,000 - 2,000 చదరపు అడుగుల విస్తీర్ణం గల యూనిట్ల వాటా 70 శాతంగా ఉంది.

గడపగడపకు సంక్షేమం వెలకట్టలేని సంతోషం

- తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ తీసుకొచ్చిన సంక్షేమ పథకాల వల్ల రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉన్నారని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ తెలిపారు. సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతున్నదన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వివరించారు. ప్రతి సంక్షేమ పథకాన్నీ, రూపకల్పనలో పేద ప్రజలను దృష్టిలో ఉంచుకునే రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలనే ఇప్పుడు దేశమంతా ఆచరిస్తున్నదని వివరించారు. ఈ మేరకు రాజీవ్ సాగర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో బిఆర్ఎస్ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని తెలిపారు.

ఆ నలుగురికి పరీక్ష రాసే అవకావం ఇవ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో నిందితులుగా ఉన్న నలుగురికి గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసే అనుమతి లభించింది. ఈ మేరకు హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

షమీమ్, సురేశ్, రమేశ్, సాయి సుష్మిత అనే అభ్యర్థులు తమపై టిఎస్‌పిఎస్‌సి విధించిన డిబార్‌ను ఎత్తివేయాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. జూన్ 11న జరిగే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు అనుమతి ఇచ్చింది. ఈ నలుగురికి హాల్‌టికెట్లు ఇవ్వాలని టిఎస్‌పిఎస్‌సిని ఆదేశించింది. కాగా.. పేపర్ లీకేజీ వ్యవహారంలో నిందితులుగా తేలిన 50 మంది నిందితులు పరీక్ష రాయకుండా టిఎస్‌పిఎస్‌సి శాశ్వత డిబార్ విధించిన విషయం తెలిసిందే.

అడుగంటిన భూగర్భ జలం

- తాగునీటికి కటకట
- సక్రమంగా సరఫరా కాని భగీరథ నీరు
- పనిచేయని చేతిపంపులు ఎండిపోయిన వాగులు
- అల్లాడుతున్న ఏజెన్సీ పల్లెలు
- బావులు, చెలమెలపైనే ఆధారపడుతున్న గిరిజనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షాకాలం సమీపిస్తున్నా.. వేసవి తాపం జనాలను వదలడం లేదు. మండుతున్న ఎండలకు తోడు.. తాగునీటికి గుక్కెడు నీరు దొరకని పరిస్థితి. ఊరూరా మిషన్ భగీరథ నల్లాలు బిగించినా.. సక్రమంగా సరఫరా కాకపోవడంతో అనేక పల్లెలు తాగునీటికి గోస పడుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో చేతిపంపులు పనిచేయడం లేదు. గంటల తరబడి కొడితే కానీ చుక్కనీరు రాలేని పరిస్థితి ఉంది. ఏజెన్సీ పల్లెల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అనేక ఏజెన్సీ పల్లెలు గొంత తడుపుకొనేందుకు తండ్లాడుతున్నాయి. బిందెడు నీటి కోసం కొండలు, కోనలు దాటుతూ బావులు, చెలిమెల వద్దకు వెళ్తున్నారు. అడుగుభాగాన మిగిలిన కొద్దిపాటి నీటిని తెచ్చుకుంటూ దాహం తీర్చుకుంటున్నారు. ప్రభుత్వం తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం రూ.కోట్లాది నిధులు వెచ్చించి ఊరూరా మిషన్ భగీరథ ట్యాంకులు నిర్మించినా పూర్తిస్థాయిలో సత్ఫలితాలివ్వడం లేదు. సరఫరాలో అంతరాయం కలుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికంగా ఎండలు మండుతున్నాయి. ఈ ఏడాది ఏకంగా 46డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. తాజాగా జిల్లాలో సగటున 8మీటర్ల లోతులో నీటి మట్టం ఉన్నట్టు భూగర్భజల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో చేతిపంపులు పనిచేయడం లేదు. బిందెడు నీరు రావాలంటే గంటల తరబడి కొట్టాల్సిన పరిస్థితి. మరోపక్క మిషన్ భగీరథ ట్యాంకులు నిర్మించి..పైప్‌లైన్లు వేసినా సరఫరాలో లోపం కారణంగా అనేక పల్లెలకు తాగునీరు సక్రమంగా అందడం లేదు. గాదిగూడ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని.. సమస్య తీర్చడానికి ప్రత్యామ్నాయంగా ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదని ఇటీవల జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంద్రవెల్లి, తలమడుగు, బజార్‌హత్నూర్ తదితర మండలాల్లోనూ ఈ సమస్య తీవ్రంగా ఉందని ఆయా మండలాల జడ్పీటీసీలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోకపోవడంతోనే కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

బావులు, చెలిమెలే దిక్కు..!

మిషన్ భగీరథ పథకం రాకముందు ఏజెన్సీలోని వందలాది గ్రామాలు తాగునీటి సమస్య ఎదుర్కొనేవి. కానీ భగీరథ వచ్చిన తర్వాత పల్లెల్లో కొంతవరకు సమస్య తీరింది. అయినా ఎండలు పెరగడంతో చాలా పల్లెల్లో ఇంకా నీటి సమస్య తీవ్రంగా ఉంది. భగీరథ నీటి సరఫరాలో తలెత్తిన లోపాల కారణంగా ఆయా పల్లెలు తాగునీటికి తండ్లాడాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ పంచాయతీ పరిధిలోని మామిడిగూడతోపాటు కైర్‌గూడ, సాలెగూడ, దుర్వగూడ, దొడంద, గట్టెపల్లి, దనోరా(బి), దస్నాపూర్‌గూడ తదితర గ్రామాల్లో నీటి సమస్య కనిపిస్తోంది. ఆదిలాబాద్ గ్రామీణ మండలం అల్లికోరి, లోహర, మాంగ్లిలోనూ ఈ సమస్య ఉంది. మిగితా మండలాల్లోని మారుమూల పల్లెల్లోనూ తాగునీటి సమస్య నెలకొంది. తాగునీటి కోసం ఊరి పొలిమేరల్లో ఉన్న బావుల దగ్గరకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. అనేక గిరిజన పల్లెల్లో ఈ సమస్య ఉన్నా అధికార యంత్రాంగం దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి.

తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది

పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఏజెన్సీ పల్లెల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. పైప్‌లైన్లు లీకేజీలు, నల్లాలు సక్రమంగా ఉండకపోవడం కారణంగా సరఫరా కావడం లేదు. చేతిపంపులు పనిచేయడం లేదు. అడుగంటిన బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని గిరిజనులు తెచ్చుకుంటూ తాగేందుకు వినియోగిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

తీగలాగితే డొంక కదిలింది

- పేపర్ లీకేజీ కేసులో రూ.1.63 కోట్ల లావాదేవీలు
- 49మంది అరెస్టు, న్యూజిలాండ్‌లో మరో నిందితుడు
- టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నపత్రాల కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో తీగలాగితే డొంక కదిలింది. మార్చ్ 11న హైదరాబాద్ బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, దాన్ని సిసిఎస్‌కు బదిలీ చేశారు. ప్రత్యేక బృందం సిట్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగింది. ఈ కేసులో ఇప్పటివరకు 49 మందిని సిట్ అధికారులు అరెస్టు చేయగా, వీరిలో 18మంది మధ్యవర్తులుగా ఉన్నట్టు దర్యాప్తులో తేల్చారు. ఈ మేరకు సిట్ అధికారులు శుక్రవారం నాంపల్లి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

ఈ కేసులో రూ.1.63 కోట్ల లావాదేవీలు జరిగినట్టు విచారణలో తేలిందని ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే నిందితులకు సంబంధించిన ఖాతా వివరాలు, చేతులు మారిన నగదు వివరాలను పొందుపర్చారు. మరింత సమాచారం కోసం మరికొంత మందిని అరెస్టు చేయాల్సి వుందన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసిన మరో నిందితుడు ప్రశాంత్ న్యూజిలాండ్‌లో ఉన్నట్టు వెల్లడించారు. ఏఈఈ ప్రశ్నపత్రం లీకైన తర్వాత 13 మందికి, డిఎఒ పేపర్ 8 మందికి, గ్రూప్-1 ప్రిలిమ్స్ నలుగురికి చేరాయని గుర్తించినట్టు తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పేపర్ చేరిన నలుగురిలో టిఎస్‌పిఎస్‌సిలో పనిచేసే ముగ్గురు ఉద్యోగులుండగా, మరో వ్యక్తి బయటివాడని వివరించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు దశలోనే ఉన్నట్టు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా ఇటీవల అరెస్టయిన డీఈ పూల రమేష్ సహకారంతో ఏఈ, డిఎఒ పరీక్షల్లో చూసిరాతకు పాల్పడిన ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్, ఎలక్ట్రానిక్ పరికరాలను రామంతాపూర్‌లోని సెంట్రల్ ఫోరెనిక్స్ సైన్స్ లాబోరేటరీకి పంపించినట్టు తెలిపారు. వాటిని విశ్లేషిస్తున్న క్రమంలో మరికొంత సమాచారం బయటికి వచ్చినట్టు వెల్లడించారు. డీఈ రమేష్ ఏఈఈ ప్రశ్నపత్రాన్ని మరికొంత మందికి విక్రయించినట్టు సిట్ అధికారులు భావిస్తున్నారు. ఏ-1గా పీ.ప్రవీణ్‌కుమార్ (ఏఎస్ఓ)గాను, ఏ-2గా అట్లా రాజశేఖర్(నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్),ఏ-3గా రేణుఖా రాథోడ్, ఏ-4గా ఎల్.ధాక్యా, ఏ-5గా కేతావత్ రాజేశ్వర్, ఏ-8గా కేతావత్ శ్రీనివాస్, ఏ-9 కేతావత్ రాజేందర్ నాయక్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేసినట్టు ఛార్జ్‌షీట్‌లో పొందుపర్చారు. ఈ కేసులో అరెస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. కేసు దర్యాప్తులో తేలే మిగతా నిందితులను బట్టి అనుబంధ అభియోగపత్రాలను దాఖలు చేయాలని భావిస్తున్నట్టు సిట్ అధికారులు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు.

పోలీసు ఉన్నతాధికారులు బదిలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. వీరిలో కొందరికి పదోన్నతి లభించింది. ట్రాఫిక్ అదనపు డిసిపి కె ప్రసాద్, సెంట్రల్ జోన్ అడిషినల్ డిసిపి ఎ.రమణా రెడ్డి, రాచకొండ అడిషినల్ డిసిపి సి. నర్మద, మాదాపూర్ అడిషినల్ డిసిపి రషీద్ అహ్మద్ అబ్దుల్‌లకు నాన్ కేడర్ ఎస్‌పిగా పదోన్నతి లభించిది. వీరిని డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా హోంశాఖ కార్యదర్శి జితేందర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లలో పనిచేస్తున్న పలువురు ఎసిపిలకు పదోన్నతి కల్పించి బదిలీచేశారు. రాచకొండ ఎసిపి నర్సింహారెడ్డి, హైదరాబాద్ (ఎస్‌బి) ఎసిపి నర్సింహారావు, సిసిఎస్ ఎసిపి రవికుమార్, సైబరాబాద్ ఎసిపి శ్యాంబాబు, సెక్రటేరియేట్ ఎసిపి రాందాసు, ఎస్బి ఎసిపి ప్రసాదరావు, సైబరాబద్ ఎస్‌బి ఎసిపి సుందరారావు, బేగంపేట ఎసిపి పృథ్వీధర్ రావు, సిసిఆర్‌బి ఎసిపి జహంగీర్ షేక్, హైదరాబాద్ సిటిసి ఎసిపి శ్రీనివాస్, హైదరాబాద్ వెస్ట్ జోన్ ట్రాపిక్ ఎసిపి కోటేశ్వరరావులకు అదనపు డిసిపిలుగా పదోన్నతి లభించింది.

24 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

- రాష్ట్రవ్యాప్తంగా 18 సెంటర్లలో పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన ఎస్ఐ, కానిస్టేబుల్, తత్సమాన పోస్టు తుది రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతుందని రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వివి శ్రీనివాసరావు ప్రకటించారు. 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రాష్ట్రంలోని 18 కేంద్రాల్లో ఈ పరిశీలన జరుగుతుందని ఆయన తెలిపారు. అభ్యర్థులకు ఏయే తేదీలలో ఈ పరిశీలన జరుగుతుందనేది సంబంధిత అభ్యర్థుల వారి అకౌంట్లలో తమ అధికారిక వెబ్‌సైట్ ద్వారా 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు తెలుపుతారని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన అభ్యర్థులు శివలాల్ పోలీసు స్టేడియంలో, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అభ్యర్థులు అక్కడి సిటిసి గ్రౌండ్‌లో, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అభ్యర్థులు అంబర్‌పేట్ సిపిఎల్ పోలీస్ గ్రౌండ్స్‌లో, వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అభ్యర్థులు అక్కడి పోలీసు గ్రౌండ్స్‌తో పాటు ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ తదితర జిల్లాలకు చెందిన అభ్యర్థులు వాటి జిల్లా ఎస్పీ ఆఫీసు సమీపంలోని పోలీసు గ్రౌండ్‌లలో వెరిఫికేషన్లు జరిపించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అభ్యర్థులకు తమకు కేటాయించిన తేదీల పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని ఆ పత్రాలతో పాటు వారి చదువుకు సంబంధించిన అర్హత పత్రాల ఒరిజినల్స్‌ను తీసుకొని హాజరు కావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, అధికారికంగా జారీ చేసిన కులధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర సంబంధిత పత్రాలనూ కచ్చితంగా వెంట తీసుకురావాలని ఆయన అభ్యర్థులకు సూచించారు. ఉదయం తొమ్మిది గంటలకే వెరిఫికేషన్ కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సర్టిఫికేట్ల వెరిఫికేషన్ తర్వాత సంబంధిత అధికారులు అభ్యర్థుల నుంచి సంతకాలు తీసుకొని దాని ధృవీకరణ పత్రాన్ని సంబంధిత అభ్యర్థికి అందజేస్తారని చెప్పారు. ఎస్సై, కానిస్టేబుల్, తత్సమాన పోస్టులకు సంబంధించి మొత్తం 1,09,606 మంది అభ్యర్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరుపుతున్నట్టు ఆయన తెలిపారు.

సెప్టెంబరు 17న కాంగ్రెస్ మేనిఫెస్టో...

- రాష్ట్రంలో విజయం సాధించి సోనియా గాంధీకి కానుకగా ఇద్దాం
- డబుల్ ఇంజన్ అంటే అదానీ, ప్రధానే
- యూత్ కాంగ్రెస్ జాతీయ సమావేశంలో పిసిసి చీఫ్ రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన కాంగ్రెస్ మేనిఫెస్టోను తెలంగాణ విమోచన దినోత్సవమైన సెప్టెంబర్ 17న విడుదల చేస్తామని పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు. అత్యంత కీలకమైన ఐదు అంశాలతో ప్రజల వద్దకు వెళతామన్నారు. అగ్రనాయకులు అందుబాటులో ఉండే అవకాశాన్ని బట్టి బహిరంగ సభలు నిర్వహిస్తామని తెలిపారు. కర్నాటకలో మాదిరిగానే తెలంగాణలోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి, ఆమెకు కానుక ఇద్దామని వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడలోని ఓ ప్రముఖ హోటల్‌లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ జాతీయ సమావేశంలో రేవంత్ మాట్లాడారు.

ఎన్నికల యుద్ధంలో గెలవాలంటే యువత ముందుండి పోరాడాలని రేవంత్ ఈ సందర్భంగా సూచించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం అవిశ్రాంతంగా కృషి చేయాలని చెప్పారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాల్సిన అవసరముందన్నారు. దీనికి అవసరమైన కార్యాచరణపై యూత్ కాంగ్రెస్‌కు దిశానిర్దేశం చేశామన్నారు. క్షేత్ర స్థాయిలో కీలకంగా పని చేసిన వారే, రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులవుతారని గుర్తు చేశారు. మోడీ, కెసిఆర్‌లను గద్దె దించాలంటే యూత్ కాంగ్రెస్ క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. నాయకుడుగా మారేందుకు ఇది ఒక వేదిక అని తెలిపారు. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రేనే ఉదాహరణ అని వివరించారు. 1200 మంది విద్యార్థి, యువత ప్రాణత్యాగాలతో తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశారు. డబుల్ ఇంజన్ అంటే ఆదాని, ప్రధాని అని ఎద్దేవా చేశారు. దేశాన్ని దోచుకోవడమే ఈ డబుల్ ఇంజన్ పని అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వన్ నేషన్ వన్ పార్టీ' అనేది బిజెపి రహస్య ఎజెండా అని విమర్శించారు. బిజెపి కుట్రలను ఛేదించి దేశంలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలన్నారు. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయని, అందువల్ల కార్యకర్తలంతా క్రియాశీలకంగా పనిచేయాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం అందరం సమిష్టిగా కష్టపడదామని పిలుపునిచ్చారు. తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు.

గడీల పాలన పునరుద్ధరించేందుకే కేసీఆర్ ధరణి తీసుకొచ్చారని రేవంత్ విమర్శించారు. బినామీల పేరిట సిఎం కెసిఆర్ వేల ఎకరాలను కొట్టేశారని ఆరోపించారు. కొద్ది మంది భూస్వాముల కోసమే ధరణి తెచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ధరణి పోర్టల్‌ను పూర్తిగా ఎత్తివేస్తామన్నారు. 97శాతం భూవివాదాలకు ఆ పోర్టలే కారణమని చెప్పారు. మాట ఇచ్చిన ప్రకారం ధరణిని బరాబర్ రద్దు చేస్తామని తెలిపారు. భూముల విషయంలో అవకతవకలకు పాల్పడ్డ అధికారులను ఊచలు లెక్కబెట్టిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారుల దగ్గర ఉండాల్సిన సమాచారం దళారుల చేతికి వెళ్లిందని ఆరోపించారు. ధరణిని రద్దు చేస్తామంటే కేసీఆర్‌కు ఎందుకంత దుఃఖం వస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఏడ్చి, గోల పెట్టినా తండ్రి కొడుకులను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. 2004 నుంచి 2014 వరకు జరిగిన అభివృద్ధి, 2014 నుంచి ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నట్టు రేవంత్ చెప్పారు. 2014 తర్వాత జరిగిన అభివృద్ధిపై మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ అడ్డుకోవడానికే కేసీఆర్ చిల్లర మల్లర వేషాలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎవరు, ఎవర్ని శంకరగిరి మాన్యాలు పట్టిస్తారో త్వరలోనే తెలుస్తుందని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇస్తే, ఈ దొంగల పాలన నుంచి విముక్తి కల్పిస్తామని వ్యాఖ్యానించారు.

కుసుమ జీవితం ఆదర్శం

- సాహితీ సృజనతో ప్రజలను జాగృతం చేశారు
- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి-కల్చరల్

ఒక వైపు అట్టడుగు వర్గాల ప్రజల శ్రేయస్సుకు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మరో పక్క సాహిత్య సృజనతో ప్రజలను జాగృతం చేసిన కుసుమ ధర్మన్న జీవనం ఆదర్శనీయమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో కార్యక్రమాల్లో భాగంగా కుసుమ ధర్మన్న సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిధిగా ఆచార్య ఇనాక్ పాల్గొని మాట్లాడుతూ రాజమండ్రిలో జన్మించిన ధర్మన్న అక్కడి కులాధిపత్యాన్ని ఎదిరించి నిలిచి బడుగు వర్గాల వారికోసం జయ భేరి పత్రికను రంగూన్‌లోని విదేశీ తెలుగు వారినుంచి నిధులు సేకరించి నడిపారని వివరించారు. ధర్మన్న దళిత పదంకు వ్యతిరేకి అని గాంధీజీ పట్ల అభిమానం ఉన్నా ఆ పదం వాడటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసి అది హిందూ పదం వాడాలని సూచించారని పేర్కొన్నారు. ధర్మన్నకు నాడు సంఘ సంస్కర్త వీరేశలింగం సహకరించారని తెలిపారు. ధర్మన్న ఉద్యమ ప్రభావం జస్టిస్ పార్టీ ఆవిర్భావంకు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు మాల పల్లి రాసేందుకు దోహదం చేశాయని అన్నారు. గాన సభ ఎదో ఒక వర్గానికి కాకుండా సామాజిక చైతన్య దృష్టి మానవత్వాన్ని చూపే విజ్ఞతతో ధర్మన్న వంటి వారిని స్మరించటం బడుగు వర్గాల పెళ్లిళ్లకు వుచితంగా హాల్ అందించటం వంటి పనులు చేస్తున్న జనార్ధన మూర్తి కార్యవర్గం అభి నందనీయులు అని కొనియాడారు. జర్నలిస్ట్ జయ సూర్య మాట్లాడుతూ దళిత ఉద్యమ వైతాళికుడు ధర్మన్న అన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ చరిత్రపుటల్లో మరుగు పడుతున్న ధర్మన్న వంటి మహనీయులు ను సంస్మరించు కోవటం అవసరమని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై బండి శ్రీనివాస్ పాల్గొని వందన సమర్పణ చేశారు.

బిఆర్ఎస్ మహిళా కౌన్సిలర్ ఆత్మహత్య

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగలక్ష్మి (ఫైల్‌ఫోటో)

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని 24వ వార్డు కౌన్సిలర్ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్, శివాని విద్యాసంస్థ ప్రిన్సిపల్ కుందూరు నాగలక్ష్మి (40) శుక్రవారం తన నివాసంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు సిఐ నర్సింహారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. నాగలక్ష్మికి భర్త శ్యాంసుందర్ రెడ్డి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

గురువారం రాత్రి ఏం జరిగింది..

గురువారం రాత్రి కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి, నాగలక్ష్మి పట్టణంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై పొద్దుపోయే సమయానికి ఇంటికి చేరుకున్నారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య చిన్న ఘర్షణ జరిగినట్టు సమాచారం. ఆ సమయంలో నాగలక్ష్మి బెడ్ రూమ్‌లోకి వెళ్లి తలుపులేసుకున్నారు. కుమార్తె ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో భర్త, కుమార్తె ఇద్దరూ హాల్‌లోనే నిద్రించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం తలుపు తీయాలని కూతురు పలుమార్లు కోరినా లోపలి నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో వాచ్‌మెన్ తలుపులు పగులగొట్టి చూడగా.. నాగలక్ష్మి విగతజీవిగా కనిపించినట్టు స్థానికులు చెప్పారు.

సంపద కొందరి చేతుల్లోనే

- బిఆర్ఎస్ పాలనపై టిడిపి ఉపాధ్యక్షులు కాట్రగడ్డ ప్రసూన విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంపద కొందరి చేతుల్లోనే ఉందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన విమర్శించారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ట్రస్ట్‌భవన్‌లో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ సంపదను వికేంద్రీకరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కెసిఆర్ కుటుంబానికి, కెసిఆర్ చుట్టూ ఉన్న తాబేదారుల కోసం నిర్ణయాలు తీసుకోకుండా రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాలు, అన్ని తరగతుల ప్రజల అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను మూడు లక్షల మందికి ఇస్తామని చెప్పి, కేవలం 50 వేల మందికే పంపిణీ చేయడాన్ని తప్పుబట్టారు. సాగునీటిరంగంలో తమ ప్రభుత్వ గొప్ప ప్రగతిని సాధించిందని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ సర్కారు, కాళేశ్వరంతోనే రాష్ట్రమంతా సస్యశ్యామలమైనట్టు చెప్పడాన్ని ఖండించారు. కేవలం 100 టిఎంసిలను మాత్రమే ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు ద్వారా ఉపయోగించుకుందన్నారు. ఇందులో భాగంగా లక్ష్మీ బ్యారేజీ, సరస్వతి బ్యారేజ్‌లు నీటిలో మునిగిపోయాయని గుర్తు చేశారు. దళితులకు మూడెకరాల భూమి హామీ ఏమైందని ప్రశ్నించారు. దశాద్ది ఉత్సవాలు ఎన్నికల ప్రచారానికేనని విమర్శించారు. విలేకర్లతో అధికార ప్రతినిధి ఎఎస్ రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ లీలాపద్మావతి పాల్గొన్నారు.

మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి

తెలుగు మహిళా అధ్యక్షురాలు బి షకీలారెడ్డి

రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని తెలుగుదేశం తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు బి షకీలారెడ్డి విమర్శించారు. మానవ అక్రమ రవాణాలోనూ ఇదే పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. ఎన్‌సీబీఆర్ నివేదికలు ఈ విషయాలను స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. ప్రతియేటా 200కేసులు నమోదైతే, శిక్షలు మాత్రం కేవలం రెండు శాతం మందికే పడుతున్నాయని చెప్పారు. లైంగిక వేధింపులు సైతం పెరుగుతున్నాయని గుర్తు చేశారు. సిఎం ప్రగతిభవన్‌న ఉంచి బయటకు వస్తే మహిళలపై అఘాయిత్యాలు కనిపిస్తున్నాయని తెలిపారు.

గూప్ -1 పరీక్ష నిర్వహణ యుపిఎస్‌సికి అప్పగించాలి

- ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యమ నినాదాల్లో ఒకటైన నియామకాలను సాకారం చేసేందుకు ఉద్దేశించిన విభాగాల్లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముఖ్యమైందని, కానీ దాని పనితీరు మాత్రం లోపభూయిష్టంగా ఉందని ఎఐవైఎఫ్ విమర్శించింది. పోటీ పరీక్షల నిర్వహణలో విఫలమై, ప్రశ్న పత్రాల లీకేజీలకు టిఎస్‌పిఎస్‌సి కేంద్ర బిందువుగా మారిందని తెలిపింది. ఒక వైపు ప్రశ్నపత్రాల లీకేజీలకు సంబంధించిన నింధితుల విచారణ, దర్యాప్తు పూర్తిగా జరగకుండానే, కమిషన్‌లో ఉన్న లీకేజీ దోషులను తొలగించకుండానే, ఆ బోర్డు ఆధ్వర్యంలో మళ్లీ పరీక్షలను నిర్వహించడం అంటే నిరుద్యోగులను మోసం చేయడమేనని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ, ఆదివారం రాష్ట్రంలో టిఎస్‌పిఎస్‌సి ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రూప్ 1 పరీక్ష నిర్వహణ బాధ్యతలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సికి) అప్పగించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కె ధర్మేంద్రలు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయం (సత్య నారాయణరెడ్డి భవన్)లో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వస్తున్నా వాటిని పకడ్బందీగా నిర్వహించలేకపోయిన టిఎస్‌పిఎస్‌సి బోర్డ్‌ను ప్రక్షాళన చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.